ACCION FRATERNA ecology centre sustainable . human . nature

ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం ఫిబ్రవరి, 2009

FOR PRIVATE CIRCULATION ONLY

# ఉపాధి హామీ పథకం - గ్రామీణ ఉపాధి ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు

అనేక ప్రభుత్వ పథాకాలను మనం చూచినాము. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. మరికొన్ని ఏ విలువలు లేకుండా నత్తనడక నడవడం కూడా గమనించాము. ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, సాంఘిక బాధ్యతగా ప్రజల సంక్షేమానికి పథకాలు రూపొందిస్తాయి. అవి ఎంత ఘనంగా ఉన్నా ఆచరణలోకొచ్చేటప్పటికి ప్రజలకు అందకుండా, మధ్య దళారుల సొమ్ముగానే మారడం గమనించనూ గమనించాము. చట్ట సభలను, రాజకీయ నాయకులకూ ప్రభావితం చేయలేని స్థితిలో ఉండడంతో వ్యవసాయ కూలీల హక్కులు కాపాడే విషయాన్ని పట్టించుకున్న సందర్భాలు చాలా తక్కువ. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికొరకని వచ్చిన పథకాలన్నీ రూపంలో ఎంతో గొప్పగా కనపడినాయి తప్ప, ప్రజలకు ఉపయోగపడింది లేదు. ఇటువంటి పరిస్థితులలో జాతీయ ఉపాధి హామీ పథకం 2005 పార్లమెంటులో చట్టం కావడం విప్లవాత్మకమైన చట్టంగా మనం భావించవచ్చు. కాయకష్టం చేయగల గ్రామీణ ప్రజలకు నేరుగా ఫలితాలు ఇచ్చే చట్టం ఇది. ముఖ్యంగా నీటి పారుదల సౌకర్యం లేకుండా దాదాపు వర్షాధారం మీదనే ఆధారపడి వ్యవసాయం చేసే మన జిల్లాలో సంవత్సరంలో 3-4 నెలలు మాత్రమే పని ఉంటుంది. మిగతా నెలలన్నీ ఏ పనులు లేకుండా ఉంటారు. వ్యవసాయం మీద ఆధారపడిన రైతు కుటుంబాలకే పంటలు లేకుండా జీవనం కష్టమవుతున్నటువంటి పరిస్థితులలో, సీజను కాలంలో కూడా రెండు మూడు వారాలకు మించి వ్యవసాయ పనులు దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ పథకం భూమి లేని వారికే కాకుండా చిన్న సన్నకారు రైతులకు కూడా ఉపాధి ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుంది. ఇటువంటి పరిస్థితులలో ఈ చట్టం ఒక వరప్రసాదంలాంటిది. ఈ చట్టం ద్వారా మొట్టమొదటిసారిగా శ్రమ చేయాలనుకునే వారికి పనిమీద హక్కు ఏర్పడుతుంది. సంవత్సరంలో పని కోసం నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని గ్యారంటీ ఉంటుంది. ఇది కూలీలకు చట్టం ద్వారా సంక్రమించిన పని హక్కు. దీని ద్వారా వారికి ప్రభుత్వం పని కల్పించి తీరాలి. అట్లా పని కల్పించకపోతే, నిరుద్యోగ భృతి చెల్లించవలసి ఉంటుంది. గ్రామ సభల ద్వారా పనులు ఎంపిక చేసుకున్న దగ్గర్నుంచీ కూలీలకు సొమ్ము చెల్లించే వరకూ అంతా పద్ధతి ప్రకారం సాగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినారు. ఈ పనులన్నీ కూడా గ్రామ వనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించవచ్చు. కానీ వాస్తవంగా ఆచరణలో అనేక ఒడిదుడికులను ఎదుర్కొంటున్నది. అయినా స్థూలంగా గ్రామీణ పేదలకు ఒక గొప్ప ఆలంబన దిశగా ఈ కార్యక్రమం ఎదుగుతున్నది.

ఈ పథకం ఒక్కసారి ఆకాశంలోంచి ఊడిపడలేదు. గతంలో అమలుపర్చిన పథకాల ఫలితాలు, అవి ప్రజలకు చేరకుండా మధ్య దళారీలు, రాజకీయ నాయకులు కైంకర్యం చేసినట్లుగా వచ్చిన అనుభవాలున్నాయి. కొంతమంది సాంఘిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగంలో ఉండే కొంతమంది నిజాయితీ అధికారులు, ప్రజలకు లబ్ది చేకూరాలని గాఢంగా విశ్వసించే రాజకీయ నాయకుల కృషి ఫలితంగా ఈ చట్టం రూపుదిద్దుకున్నది. ఈ పథకం అమలులో గ్రామ పంచాయితీలకు ప్రధాన బాధ్యత అప్పగించబడింది. వీటితో పాటు ప్రజలందరికీ కూడా దీనిని కాపాడుకోవలసిన బాధ్యత ఉంది.

దీనిలో ఉన్నటువంటి మిగతా పథకాలలో లేనిది ప్రధాన అంశం ఏమంటే, మునుపటి సంక్షేమ పథకాలలో ప్రజలు ప్రేక్షక పాత్రధారులు, అధికారులు, రాజకీయ నాయకులు అమలుపర్చే స్థానంలో ఉండడం మూలంగా, సహజంగానే ఈ వర్గాలు తమ స్వార్థపూరిత ప్రయోజనాలకోసం ప్రజలకు మొండి చెయ్యి చూపించగలిగే సాహసం చేశారు. అయితే ఉపాధి హామీ పథకంలో, చట్టాన్ని సంరక్షించి కావలసిన సహకారాలు అందించేవారు అధికారులైతే, దీనిని నడిపించి ఉపయోగపెట్టుకునే హక్కు, బాధ్యత ప్రజలది. ఈ హక్కు చట్టబద్ధం కాబడింది. దీనిని ఎవరూ మార్చలేరు. ఒక్క పార్లమెంటు ద్వారానే అది సాధ్యం అవుతుంది. ప్రజల పాత్రను, తద్వారా లబ్ధిపొందే అవకాశాన్ని చట్టం రూపేణా ఏర్పడిన మొట్టమొదటి చట్టంగా దీనిని మనం చెప్పుకోవచ్చు. పనులలో అయ్యే ఖర్చును 75 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తే, 25 శాతం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. మొదట స్థూలంగా చట్టం యొక్క ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

### ఈ చట్టం ద్వారా కూలీలకు సంక్రమించే హక్కులు :

1. 18 సం॥ పైబడి వయస్సు కలిగి గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ, శారీరక కష్టం చేయడానికి సిద్ధపడే వారందరికీ ఉపాధి హక్కు ఉంటుంది.
2. శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగావున్న ప్రతి కుటుంబము గ్రామ పంచాయితీకి దరఖాస్తు చేసుకొని ఒక జాబ్‌కార్డ్ పొందే హక్కువుంది. జాబ్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతి కుటుంబానికి 15 రోజులలోపు జాబ్‌కార్డు ఇవ్వవలసి వుంటుంది. జాబ్‌కార్డ్ కాలం కనీసం 5 సం॥లు వుంటుంది.
3. అలా జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి పొందే హక్కు వుంటుంది.
4. జాబ్‌కార్డు ఉండి, పనిచేయడానికి సిద్ధంగా వున్న సమయంలో పని కల్పించమని కోరుతూ ఫీల్డు అసిస్టెంటు లేదా ప్రాజెక్టు ఆఫీసరుకు దరఖాస్తు చేసుకోవలసి వుంటుంది. ఆ విధంగా దరఖాస్తు చేసుకొన్న 15 రోజుల లోపు ప్రభుత్వం పని చూపించవలసి వుంటుంది.
5. చేయవలసిన పనిని గ్రామానికి 5 కి.మీ.లోపల ఉండవలయును. ఒకవేళ పని 5 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో చూపిస్తే 10 శాతం అదనపు కూలీ ఇవ్వవలసి ఉంటుంది.
6. పని దినాలలో కనీసం మూడవంతు మహిళలకు కేటాయించాలి. వికలాంగులకు కూడా సానుకూలంగా వుండే విధంగా మన రాష్ట్ర

→

ప్రభుత్వం ఆదేశాలను జారీచేసింది. ఉదా:- వికలాంగులకు సంవత్సరానికి 150 రోజుల పని కల్పించాలి. అంతేగాకుండా వారికి 30 శాతం అధిక వేతనం యివ్వాలి.

**7.** **నష్టపరిహారం పొందే హక్కు :-** ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొన్న 15 రోజులలోపు పని చూపించకపోతే 16వ రోజు నుండి 30 రోజుల వరకూ రోజుకు రూ.20 ప్రకారం నష్టపరిహారం పొందే హక్కు కూలీలకు వుంది. 30 రోజుల తరువాత కూడా పని చూపించకపోతే రోజుకు రూ.40 నష్టపరిహారం పొందే హక్కు కూలీలకు వుంది. ఈ నష్టపరిహారం పొందడానికి పనికోసం దరఖాస్తు నకలు మీద ఫీల్డు అసిస్టెంటు లేదా ప్రాజెక్టు ఆఫీసరు సంతకం చేసి తేది వేయాలి.

**8.** **వేతనాలకు సంబంధించిన హక్కులు :** పనిచేసిన ప్రతికూలీకి కనీస కూలీ పొందే హక్కు వుంది.

ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పని పరిమాణమునుబట్టి కూలి చెల్లిస్తున్నారు. అయితే 7 గంటలు పనిచేస్తే కనీసం రూ.80 కూలీ పడేటట్లు యూనిట్ రేట్లు ఉండాలి. యూనిట్ రేట్ల వివరాలు, జిల్లా షెడ్యూల్ ఆఫ్ రేట్సు వివరాలు కూలీలకు వివరంగా తెలియజేయాలి.

స్త్రీలకు పురుషులతో సమానంగా కూలీ పొందేహక్కు వుంది. పనిచేసిన తరువాత వారం నుండి 15 రోజులలోపు వేతనం పొందే హక్కు కూలీలకు వుంది.

పనిచేసి వేతనాలు అందకపోయినా పనిచూపించలేని దినాలకు నష్టపరిహారం అందకపోయినా, వేతన చెల్లింపుల చట్టం 1936 ప్రకారం నష్టపరిహారం పొందే హక్కు కూలీలకు వుంది.

**9.** పని ప్రదేశంలో సౌకర్యాలు, పరికరాలకు సంబంధించిన హక్కు, పని ప్రదేశములో త్రాగటానికి పరిశుభ్రమైన నీటి హక్కు ఉంది. పని ప్రదేశములో భోజనం చేయడానికి, పిల్లలు విశ్రమించడానికి తగిన నీడను ఏర్పాటు చేయవలసి వుంటుంది. పని ప్రదేశములో అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగినపుడు ప్రథమ చికిత్స కోసం ప్రథమ చికిత్స మందుల పెట్టెను అందుబాటులో ఉంచవలసి వుంటుంది.

**10.** పని చేస్తున్నప్పుడు కూలీలు ప్రమాదాలకు గురైతే వైద్యం ఖర్చు మొత్తం ప్రభుత్వం భరించాలి. ఆసుపత్రి ఖర్చులతోపాటు, ప్రమాదవశాత్తు పనిచేయలేకుండా పోయిన కాలానికి రోజుకు 40 రూపాయలు అదనంగా చెల్లించాలి.

ప్రమాదంలో ఒకవేళ కార్మికులు చనిపోతే నష్టపరిహారంగా 50,000 రూపాయలు చెల్లించవలయును. ఒకవేళ బ్రతికి వికలాంగులైతే 25,000 రూపాయలు నుండి 50,000 రూపాయలు పరిహారం చెల్లించవలసి వుంటుంది. తల్లితోపాటు వచ్చిన బిడ్డ ప్రమాదంలో గాయపడితే వైద్యం ఖర్చు ప్రభుత్వం భరించవలసి వుంటుంది.

## జిల్లాను ఏ విధంగా సస్యశామలం చేయవచ్చు ?

ఉపాధి హామీ కార్యక్రమాన్ని ఒక దీర్ఘకాలిక పథకం ప్రకారం కింది కార్యక్రమాలకు ఉపయోగిస్తే జిల్లా ఎడారీకరణ మార్గాన్ని మార్చి సస్యశామలం దిశగా మళ్ళించవచ్చు.

**1.** చెరువులను, కుంటలను పూర్తిగా పునరుద్దరించడం, పూడిక తీయడం, మరమ్మత్తులు చేయడం, లోతు చేయడం, చెరువుకట్టలను పెద్దవిగా చేసి బలోపేతం చేయడం వీటిద్వారా చెరువుల క్రింద సేద్యం అభివృద్ధి చెందడంతోపాటు, సమృద్ధిగా భూగర్భ జలాలు లభించి, బోరు బావులున్న రైతులందరూ లబ్ది పొందుతారు.

**2.** జిల్లాలో వున్నటువంటి వ్యవసాయం భూమి 27 లక్షల ఎకరాలలో కనీసము మూడవ వంతులో వర్షాధార పండ్ల చెట్లను పెట్టి పోషించుట. (మామిడి, చింత, సీతాఫలం, మొదలగునవి) అంటే దాదాపు 8 లక్షల ఎకరాలు వర్షాధార పళ్ళతోటలుగా అభివృద్ధి చేయడం, దీనిద్వారా పర్యావరణ అభివృద్ధితోపాటు 7 లక్షల మంది మెట్ట రైతులు, ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులందరూ లబ్ధిపొందుతారు. వారిలో కరువుకు తట్టుకొనే శక్తి కూడా పెరుగుతుంది.

**3.** జిల్లాలో 5 లక్షల ఎకరాలకు మించి రిజర్వు అడవి ప్రాంతము మరియు అదనంగా ఇంకా 10 లక్షల ఎకరాల రెవెన్యూ గుట్టలు బీడు భూములు ఉన్నాయి. ఈ 10 లక్షల ఎకరాలలో భూసార సంరక్షణ కోసం నీటి కందకాలను తవ్వి అభివృద్ధి చేసి, ప్రజలకు ఉపయోగపడే వర్షాధారముతో జీవించగల చెట్లను, గడ్డినినాటి సంరక్షించాలి.

**4.** జిల్లాలో వున్న 27 లక్షల వ్యవసాయ భూమిలో పొలంగట్ల మీద, కుంట కట్టల మీద విరివిగా వర్షాధారంపై జీవించగల చెట్లను నాటి సంరక్షించవలయును. తగిన విధంగా భూసార రక్షణ పనులను చేపట్టవలయును. ఈ పంట భూములలోని చెట్ల ద్వారా రైతులు తమకు కావలసిన సేంద్రీయ ఎరువులను తయారు చేసుకొనవచ్చును.

**5.** గ్రామాలలో పారిశుద్య పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. దీనితో వర్షాకాలంలో రోగాలు ప్రబలి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. గ్రామాలలో అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి మురుగునీరు బయటికి పోయే విధంగా ఏర్పాటు చేయాలి. గ్రామాలలో అన్ని కుటుంబాలకు లెట్రీన్లు కట్టించి ఇవ్వాలి. ముఖ్యంగా కొళాయిల దగ్గర నీరు నిలువకుండా వృధా నీరు మురుగు కాలువల ద్వారా వెళ్ళిపోయేటట్లు పనులు చేపట్టాలి. ఈ విధంగా గ్రామ పారిశుద్యాన్ని మెరుగుపరిస్తే ప్రజలు ఆరోగ్యవాతావరణంలో బతుకగలుగుతారు.

పై నాలుగు కార్యక్రమాలను ఒక దీర్ఘకాల పథకం ప్రకారం, పట్టుదలతో ఒక సమగ్ర విధానంతో అమలు పరిస్తే, రాబోయే పది సంవత్సరాలలో అనంతపురం జిల్లా ముఖచిత్రం మారిపోతుంది. జిల్లా అంతటా భూగర్భజలం, పచ్చదనం వెల్లివిరిసే వ్యవసాయం వృద్ధిచెంది సస్యశ్యామలం అవుతుంది.

ఇటువంటి ఒక దీర్ఘకాల ప్రణాళిక అమలు పర్చడంలో భాగంగా కూలీలకందరికీ నిరంతరాయంగా 100 రోజుల పని కల్పించవచ్చు. 10 సంవత్సరాలపాటు కూలీలకు ఉపాధితోపాటు ఎడారీకరణను ఎదుర్కొనవచ్చు. ఇటువంటి ప్రణాళిక సుసాధ్యం చేయాలంటే, ప్రభుత్వము, గ్రామ పంచాయితీలు, రైతులు, ఒక్కటై ఒకే ధృక్పథంతో అభివృద్ధి ఆశయంతో పనిచేయాల్సి ఉంటుంది.

మన జిల్లాలో ప్రస్తుతం పని చేస్తున్న వారిలో కొంతమంది భూమిలేని వారితోపాటు అధికంగా సన్న చిన్నకారు రైతులు, మధ్య తరగతి మెట్ట రైతులు వున్నారు. కాబట్టి ఈ దీర్ఘకాల ప్రణాళికల ద్వారా అధిక శాతం సన్న చిన్నకారు రైతులు మెట్ట రైతులు తాత్కాలిక ఉపాధి పొందుతూ, తద్వారా దీర్ఘకాలంలో వారి వ్యవసాయాభివృద్ధి చేసుకోగలుగుతారు.

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి సెంటరు**

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## సేంద్రీయ వ్యవసాయ విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన రైతు

డి.నారాయణప్ప (40 సం॥)కు 10 ఎకరాల మెట్టపొలం ఉంది. రాప్తాడు మండలానికి చెందిన పెసరకుంట గ్రామం చాలా చిన్న గ్రామం. గ్రామం మొత్తం మీద 40 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. గ్రామంలో అందరూ కష్టపడి వ్యవసాయం చేసేవారే. అందరిదీ మెట్ట వ్యవసాయమే. వర్షాధారం కిందపండించే వేరుశనగ వారి ముఖ్యమైన పంట. వర్షాలు అదునులో కురవక పంటలు నష్టపోతే, పంట పండినప్పుడు కూడా రసాయనిక ఎరువుల, క్రిమిసంహారక మందుల ఖరీదుతో పెట్టుబడులు ఎక్కువ అయ్యేవి. లెక్కవేసుకుంటే శ్రమ తప్ప ఏమీ మిగిలేదికాదు.

డి.నారాయణప్ప పట్టుదలగలిగిన రైతు. అందరికంటే తానే ఎక్కువ పంటలు తీయాలనే ఉద్దేశ్యంతో పోటీలు పడి రసాయనిక ఎరువులు వాడేవాడు. తెగుళ్ళు వచ్చీ రాకనే రకరకాల పురుగు మందులు తెచ్చిపిచికారీ చేసేవాడు. చివరికి తేల్చుకుంటే, మిగతా రైతులకంటే దిగుబడి కొంచెం పెచ్చుగా వచ్చేదేకానీ, ఖర్చులు మాత్రం విపరీతంగా అయ్యేది. ఒక్క ఎకరాకు 5-6 వేల వరకూ ఖర్చులు వచ్చేవి.

ఈ సందర్భంగా 2008 ఖరీఫ్‌కు పంటలకు ముందుగా ఎకాలజీ సంస్థకు చెందిన ఎటిఎల్ భాస్కరబాబు, వారి సిబ్బంది కలిసి గ్రామంలో రైతులందరినీ కలిపి ఒక సమావేశం నిర్వహించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల మూలంగా వ్యవసాయ పెట్టుబడులు పెరగడమేకాక పర్యావరణానికి కూడా తీవ్రమైన హాని జరుగుతోందని, మన ఆరోగ్యాలు కూడా దెబ్బతింటున్నాయని వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తూ, పంట రోగాలకు కషాయాలద్వారానే కాపాడుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా పంట పెట్టుబడులలో ఖర్చులు బాగా తగ్గించుకోవచ్చునని తెలిపారు. అయినా పంట కాలానికి చాలామంది తిరిగి రసాయనిక ఎరువులు, మామూలు పద్ధతుల్లోనే వ్యవసాయం మొదలుపెడితే, నారాయణప్ప మాత్రం ఈ విధానాన్ని పరిశీలించి చూడాలనుకున్నాడు.

ఎకాలజీ సిబ్బంది సారథ్యంతో వారి సూచనలమేరకే వేసవి దుక్కులు చేసి భూమిని సమాయత్తం చేశాడు. కేవలం పశువుల ఎరువు మాత్రమే పొలానికి ఎరువుగా వేశాడు. గంజు, ఇంగువ ద్రావణంలో విత్తనశుద్ధి చేశాడు. 3 1/2 ఎకరాలకు కె.6 కొత్తరకం వేరుశనగ వేశాడు. పొలం చుట్టూ జొన్న, సద్ద సరిహద్దు పంటగా వేశాడు. ఆ తరువాత 100 కేజీల పేడ, 4 కేజీల బెల్లం, 5 లీ.గంజు, నాలుగు కేజీల ఉలవ పిండి కలిపి జీవామృతం తయారుచేసి పంటకు ఇచ్చాడు. పంటకు పురుగు సోకకుండా వేపనూనె, సబ్బుపొడి కలిపి రెండు తడవులుగా పిచికారీ చేశాడు. సాధారణంగా వేరుశనగకు తెగుళ్ళకు 3-4 సార్లు రకరకాల మందులు పిచికారి చేయాల్సి వచ్చేది. కానీ ఈ పంటకు తెగుళ్ళు కూడా రాలేదు. అక్కడక్కడి కనపడినా వేపనూనె పిచికారితో వాటి అవశేషాలు కనపడకుండా పోయాయి. ఖర్చులు నామ మాత్రమే. అధిక వర్షాల మూలంగా జిల్లాలో చాలామంది రైతులు నష్టపోయినారు. వేరుశనగ దిగుబడి రాలేదు. ఇటువంటి అననుకూల పరిస్థితులలో మూడున్నర ఎకరాలకుగానూ కె6 రకం 70 మూటల దిగుబడి వచ్చింది. తన పొలం పక్కనే ఉప్పునేసినపల్లి గ్రామరైతు కూడా కె6 3 1/2 ఎకరాలు సాగు చేశాడు. అతను సేంద్రీయ పద్ధతులలో కాకుండా రసాయనిక ఎరువులు వాడాడు. ఆ రైతుకు వచ్చిన దిగుబడి 55 మూటలు. దాదాపు 15 మూటలు నారాయణప్పకు అధికంగా వచ్చింది. సేంద్రీయ పద్ధతుల్లో ఖర్చు తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుందని చెప్పడానికి నారాయణప్ప రైతు అనుభవం మనకు స్ఫూర్తిగా ఉంటుంది.

## పొలంలో సూక్ష్మజీవుల అభివృద్ధి కోసం, సత్తువ కోసం ఇదివాడి చూడండి

**ఇ.యం.ద్రావణం :-**

| | | |
|---|---|---|
| 1. | మగ్గిన అరటిపళ్ళు | 3 కిలోలు |
| 2. | బొప్పాయి పళ్ళు (గింజలు తీసి) | 3 కిలోలు |
| 3. | గుమ్మడి పండ్లు తొక్కతీసినవి | 3 కిలోలు |
| 4. | లేత కొబ్బరి నీరు | 300 మి.లీ. |
| 5. | కోడిగుడ్లు | 2 (సొన) |
| 6. | నీరు | 10 లీటర్లు |

పైవాటిలో మొదటి మూడింటిని తీసుకుని బాగా ముద్దచేసి ఒక కుండలో వేయాలి. దానికి మిగతా 4,5,6 వస్తువులను కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉంచిన కుండను గుడ్డతో కప్పి 45 రోజుల వరకూ నీడలో ఉంచాలి. మధ్య మధ్యలో ఈ మిశ్రమాన్ని కర్రతో బాగా కలియబెట్టాలి. ఈ కషాయానికి 5 లీటర్ల నీటిని చేర్చి పలుచని గుడ్డలో వడపోయాలి. ఈ ద్రావణానికి 100 లీటర్ల నీటిని చేర్చి ఒక ఎకరం పొలంలో పిచికారి చేయాలి. ఇందులో చాలా రకాల సూక్ష్మజీవులుంటాయి. ఇవి భూసారం పెంచడానికి ఉపయోగపడుతాయి. ఈ ద్రావణంలో ఉన్న పోషకాలవల్ల పంటలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. దీనిని పొలంలో 1-2 సార్లుగా పిచికారి చేసుకోవచ్చును.

(తూనిగ ఆగస్ట్ 2007 నుండి)

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## కరువు నేల ఆశాకిరణం 'అనంతజ్యోతి'

2009 ఖరీఫ్ కోసం అనంతపురం జిల్లాలోని ఒక గ్రామం రైతులందరూ పూర్తిగా అనంతజ్యోతి వేరుశనగ మాత్రమే విత్తడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కారణం 2005వ సంవత్సరం నుంచి వరుసగా ఒక రైతు తనకున్న ఎకరం పొలంలో మొదటగా అనంతజ్యోతి వేయడం, మంచి దిగుబడి తీయడం, దానినే తిరిగి విత్తనంగా మార్చుకోవడంతో ఈనాటికి ఆది ఆ గ్రామంలోని రైతులందరికీ చేరింది. ఖరీఫ్ 2009కి గ్రామం మొత్తం టి.యం.వి.2 బదులుగా అనంతజ్యోతి మాత్రమే పండించబోతున్నారు. బయటి గ్రామాలకు గానీ, అనంతజ్యోతి రకం విస్తరించాలని కృషి చేసే సంస్థలకు వ్యవసాయ పరిశోధనా నిపుణులకుగానీ తెలియకుండానే అనంత జ్యోతి విత్తనం గ్రామంలో ప్రవేశించింది. రైతులందరి వద్దా వేరుశనగ విత్తనం స్థిరపడింది.

వివరాల్లోకి వెళితే...ఆ గ్రామం పేరు పెద్దొడ్డి, గుత్తి మండలం, ఈ గ్రామానికి చెందిన విజయభాస్కరరెడ్డి, బి.చెన్నకేశవరెడ్డి రైతులు ఇరువురూ అన్నదమ్ములు. వారి మిగతా ఇద్దరు సోదరులకు కలిపి ఉమ్మడిగా అయిదు ఎకరాలు మెట్టపొలం ఉంది. ఎవరికి వారే 1.20 వంతున విభాగాలు చేసుకున్నారు. విస్తీర్ణం తక్కువ కావడంతో విజయభాస్కరెడ్డి చెన్నకేశవరెడ్డి రెండు భాగాలు కలిపే సాగు చేసుకుంటున్నారు. విజయభాస్కరరెడ్డి ఎకాలజీ సెంటరులో బెళుగుప్ప ప్రాంతంలో పనిచేస్తున్నాడు. తమ్ముడు కేశవరెడ్డి గ్రామంలోనే ఉంటూ వ్యవసాయ పనులు చూస్తున్నాడు. ఎకాలజీ సెంటరు సంస్థ టియంవి2కి ప్రత్యామ్నాయంగా కొంతమంది రైతులకు అనంతజ్యోతి మూల విత్తనాన్ని ఇచ్చి విత్తనంగా తిరిగి రైతులకే ఇప్పించే విధంగా కృషి చేస్తున్న విషయం విజయభాస్కరరెడ్డికి తెలుసు. దీనిని గురించి పూర్తి సమాచారం 2005 ఫిబ్రవరిలో తెలుసుకున్నాడు. వెస్ట్ నరసాపురంలో ఒక రైతు వద్ద అనంతజ్యోతి దొరుకుతోందని తెలిసి, మూడు మూటలు కొనుగోలు చేశాడు. ఒక మూట విత్తనాలయినాయి. ఎకాలజీ సంస్థలో తనకున్న అనుభవం ద్వారా సంప్రదాయానికి భిన్నంగా కొన్ని పద్ధతులు అనుసరించాడు. అప్పటికి ఇంకా ఎన్.పి.యం. పద్ధతులు పెద్దగా పరిచయం కాకపోవడంతో రసాయనిక ఎరువులు ఉపయోగించారు.

విత్తనం వేసిన తీరు :

2005-06 నవంబరు 25న రబీకి మొదటగా అచ్చుకట్టు బోదెలు తోలి విత్తకుండా మనుషులతో 1.20 విస్తీర్ణంలో విత్తనం నాటించారు. ఈ విధంగా చేయడం పంట ఒత్తుగానూ లేదా పలుచగానూ లేక సమంగా ఉంది. దీని కోసం 24 మంది కూలీలు అవసరమైనవారు. పంట బాగా మొలిచింది. 25 రోజుల తర్వాత కలుపు తీయించినారు. దాని తరువాత ఒకవారం అలాగే ఉంచి 28.28.0 కాంప్లెక్స్ ఎరువు రెండు మూటలు వేసి నీళ్ళు పెట్టినారు. అప్పటికి పంట వయస్సు 33 రోజులు. నీరు పెట్టిన 3-4 రోజులలో పూత విపరీతంగా వచ్చింది. చెట్ల పచ్చదనాన్ని పూర్తిగా కప్పివేసి పసుపు పచ్చగా నిండుగా వుంది. గ్రామంలో దూరం నుంచి చూచిన వారందరూ పొలం నిండా ఎర్రగొంగళి వడిందని భ్రమించి పంటనాశనమయిందని చెప్పినారు. వారి మాటలు విని సంశయంతో వెళ్ళి చూడగా పూత నిండుగా ఉండడంవల్ల ఆ రకంగా కనపడింది. కానీ ఎక్కడా ఎర్రగొంగళి లేదు.

పంట 1 1/2 నెలగా ఉన్నప్పుడు మరొకసారి కలుపు తరువాత ఒక తడి ఇవ్వడం జరిగింది. పంట 60 రోజులకు వచ్చిన తరువాత రెండు మూటల సూపర్ ఫాస్పేట్ చల్లి ఒక తడి ఇవ్వడం జరిగింది. అప్పటికి పైరు అడుగుకు పైగా ఎత్తు పెరిగింది. ఆకు ముడత వస్తుందేమోనని బావిస్టిన్ మందు పిచికారీ చేశారు. 70 రోజులు వచ్చిన తరువాత మరొక తడి ఇవ్వడం జరిగింది (నాలుగవ తడి) అప్పటి నుండి ప్రతి పది రోజులకు ఒక తడి ఇచ్చినారు. 120 రోజులకు పంట పూర్తిగా అయిపోయింది. కాయ కూడా మంచి సైజుగా ఉంది. పంట విరగకాసింది. పైరు మొక్కలు సమపాళ్ళ దూరంలో ఉండడం మూలంగా పైరు బాగా పెరిగింది. సగటున ఒక్కొక్క చెట్టుకు 30-40 కాయలకు తక్కువ కాకుండా ఉన్నాయి. ఒక్క చెట్టుకు మాత్రం కాయలు 108 దాకా ఉన్నాయి. పైరు పెరకడానికి వచ్చిన ఒక మహిళా కూలీ ఆ చెట్టును తీసుకుని వెళ్ళి గ్రామంలో అందరికీ చూపించింది. అంతవరకూ గ్రామంలో వయసు మళ్ళిన రైతులు కూడా చెట్టుకు 50-60 కాయలకు మించి చూడక పోవడంతో ఒక విచిత్రంగా గ్రామమంతా చెప్పుకున్నారు.

పైరు ఆకులు వెడల్పుగా ఉండి బిరుసుగా లేకుండా మెతువుగా ఉన్ననూ, రోగాలు రాలేదు. పశువులు చాలా ఇష్టంగా తిన్నాయి. 1.20 సెంట్ల విస్తీర్ణానికి 40 మూటల కాయలు అయినాయి. గ్రామంలో టి.యం.వి.2 వేసిన మిగతా వారికి ఎకరాకు 25 మూటలకు మించి ఎవరికీ రాలేదు. మిగతా వారి టి.యం.వి.2 పైర్లకు ఆకు ముడత వచ్చింది. రెండు-మూడు సార్లుగా పిచికారి చేయాల్సి వచ్చింది. ఈ అనంతజ్యోతికి ఆ అవసరం రాలేదు. విత్తనానికి 8 మూటలు స్వంతానికి ఉంచుకుని 32 మూటలు గ్రామంలో మిగతా రైతులకు బదులు కింద ఇవ్వడం జరిగింది. ఈ పంట ఖర్చు, జమలు ఈ విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| మూడు మూటల కాయల ఖరీదు రూ.1200/- | - | 3,600-00 |
| విత్తనం పూడ్చడానికి 24 మంది కూలీలకు | - | 600-00 |
| 2 మూటల 28.28.0 కాంప్లెక్స్ ఖరీదు | - | 970-00 |
| 2 మూటల సూపర్ ఫాస్పేట్ ఖరీదు (ఖర్చుతో) | - | 450-00 |
| బావిస్టిన్ మందు పిచికారికి అయిన ఖర్చు | - | 350-00 |
| చెట్లు పీకడానికి, కాయలు విడిపించడానికి అయిన ఖర్చు | - | 1,500-00 |
| **మొత్తం ఖర్చు** | - | **7,470-00** |
| | **లేదా** | **7,500-00** |

| | | |
|---|---|---|
| 40 మూటల ఆదాయం రూ.1,200/- వంతున | - | 48,000-00 |
| ఖర్చు | - | 7,500-00 |
| **ఒక ఎకరం 20 సెంట్లలో నికరాదాయం** | - | **40,500-00** |

ఆ తరువాత ఈ రైతులో బదులు తీసుకున్న వారు 2006 ఖరీఫ్‌లో మెట్ట పొలంలో వేశారు. వర్షాలు సరిగా రాక ఆ సంవత్సరం టి.యం.వి.2 పైరు పూర్తిగా ఎత్తిపోతే, 5 ఎకరాలు తోటల్లో పండినాయి. అవి తిరిగి 2006-07 రబీలో చాలా మంది రైతులు వేశారు. ఎకరాకు 30-35 మూటలు ఎవరికీ తక్కువ కాలేదు. గత సంవత్సరం 2008 ఖరీఫ్‌లో 500 ఎకరాల దాకా రైతులు వర్షాధారం కింద వేశారు. ముఖ్యంగా అనంత జ్యోతికి బూడిద తెగులు రావడంలేదు. కాయలు దొరకక కొంతమంది ఇంకా టి.యం.వి2 వేసినారు. అయితే 2009 ఖరీఫ్‌కు మాత్రం గ్రామంలోని రైతులందరికీ సరిపడా అనంతజ్యోతి విత్తనముంది. విత్తనం వేసిన తర్వాత ఒక నెలదాటిన తర్వాతే పూత బాగా వస్తుందని అనుభవంలో తేలింది. 2008 ఖరీఫ్‌లో తాను స్వంతంగా ఎన్.పి.యం. పద్ధతుల్లో పంట వేశాడు. దిగుబడులలో మార్పు లేదు కానీ ఖర్చులు తగ్గినాయి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in